సాక్షి నంద్యాల

గురువారం ; 27 ; ఫిబ్రవరి ; 2025



ఐక్యతకు ప్రతీక రోజా దర్గా

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా కర్నూలు రోజా దర్గా వెలుగొందుతోంది. ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉరుసు నిర్వహించనున్నారు. 8లో▸



..భక్తి పారవశ్యం

ప్రముఖ శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం మహా శివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 8లో▸



ఉద్యోగం పేరిట టోకరా

ఉద్యోగం పేరుతో నిరుద్యోగుడికి రూ.3 లక్షల టోకరా పెట్టారు. బాధితుడు డీఎస్పీ కార్యాయంలో ఫిర్యాదు చేశాడు. 8లో▸

న్యూస్‌రీల్‌

బంగారు ధారా పాత్ర బహూకరణ



పూజలు నిర్వహిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె రూరల్‌: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, ఆయన కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డి ఐదున్నర తులాల బంగారు ధారా పాత్ర బహూకరించారు. అలాగే ఎనిమిది కేజీల వెండీ హారతులను ఆలయ ఈఓ చంద్రుడుకు బుధవారం అందజేశారు. ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ను ప్రారంభించారు. ముందుగా ఆలయంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం కాటసాని కుటుంబ సభ్యులను అర్చకులు సత్కరించారు. ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ సభ్యులు దస్తగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దద్దణాల చెరువుకు ఎస్సార్బీసీ నీరు

బనగానపల్లె రూరల్‌: దద్దణాల చెరువుకు జుర్రేరు వాగు ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు తన సొంత నిధులు రూ.25.75 లక్షలతో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నాలుగు మోటార్లకు మరమ్మతు చేయించామన్నారు. చెరువుకు ఎస్సార్బీసీ నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ రాక

కర్నూలు(అర్బన్‌): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ షేక్‌ అబ్దుల్‌ అజీజ్‌ గురువారం కర్నూలుకు రానున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్‌ సబీహా పర్వీన్‌ తెలిపారు. ఉదయం 8 గంటలకు నెల్లూరు నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ అతిథి గృహం చేరుకుంటారని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన యువకులు

హొళగుంద: స్థానిక హొళగుంద–బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో స్నానానికి వెళ్లి ఈత రాక కొట్టుకుపోతున్న ఇద్దరిని స్థానిక యువకులు కాపాడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు చెందిన షమీ, బాషాతో పాటు పలువురు హొళగుందలోని ఓ మసీదులో పెయింట్‌ పనికి వచ్చారు. పని ముగించుకుని సాయంత్రం స్నానం చేసేందుకు బళ్లారి రోడ్డులోని దిగువ కాలువలో దిగారు. ఇటీవల కాలువ గట్టుకు సిమెంట్‌ లైనింగ్‌ చేయడంతో ఈత షమీ, బాషా గట్టు కింద జారుకుంటూ కాలువలో కొట్టుకోపోసాగారు. వారి అరుపులు విన్న అటుగా వెళ్తున్న సిద్దిక్‌, మౌలాలి, సమీర్‌ వెంటనే కాలువలో దూకి ఇద్దరినీ బయటకు లాగారు. దీంతో యువకులను పలువురు అభినందించారు.



నంది వాహన సేవలో ఆదిదంపతులు



కనుల పండువగా పాగాలంకరణ



పాగాలను తీసుకొస్తున్న దృశ్యం

పాగా ప్రభ.. మహా శోభ

- శ్రీశైలంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- కనుల పండువగా ప్రభోత్సవం, నందివాహనసేవ
- పాగాలంకరుడైన శ్రీమల్లికార్జున స్వామి
- శాస్త్రోక్తంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- వైభవంగా బ్రహ్మోత్సవ కల్యాణం
- నేడు రథోత్సవం, తెప్పోత్సవం

ప్రణవ నాదం ప్రతిధ్వనించింది..

ప్రభోత్సవం కనుల పండువగా సాగింది.. మహాశివరాత్రి పర్వదినాన బుధవారం శ్రీగిరి క్షేత్రం భక్తజన సంద్రమైంది. లింగోద్భవకాల సమయాన శాస్త్రోక్తంగా నిర్వహించిన పాగాలంకరణ భక్తిపారవశ్యాన్ని నింపింది. అర్ధరాత్రి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంతో అధ్యాత్మిక శోభ వెలుగులీనింది.





ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌) ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్‌: ద్వాదశ జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలం శివమయం అయ్యింది. క్షేత్రంలో ఏ వైపు చూసినా భక్తుల కోలాహలం కనిపించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్షలాదిగా భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునుడు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామిఅమ్మవార్లకు అక్కమహాదేవి అలంకార మండపంలో నందివాహన సేవ నిర్వహించారు. నందివాహనంలో ఆదిదంపతులను అధిష్ఠింపజేసి ఆలయ ప్రదక్షణ ద్వారా ఊరేగింపు నిర్వహించారు.



రమణీయం.. ప్రభోత్సవం

శివరాత్రి తర్వాతి రోజు జరిగే రథోత్సవ నిర్వహణకు వీలుగా ముందస్తుగా ప్రతి ఏటా ప్రభోత్సవం నిర్వహిస్తారు. సుగంధ పుష్పాలతో ప్రభను బుధవారం సాయంత్రం అలంకరించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండిపల్లకీలో ఆలయ ప్రదక్షణ చేయించి క్షేత్ర ప్రధాన వీదుల్లోకి తోడ్కొని వచ్చారు. అనంతరం ప్రభపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశేష భక్తజనం మధ్య గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రభోత్సవం సాగింది. రాత్రి 10గంటల నుంచి స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. అర్చకులు, పండితులు మహాన్యాసపూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా జ్యోతిర్లింగ స్వరూపుడైన స్వామివారికి అభిషేకం చేశారు.

కమనీయం.. కల్యాణోత్సవం

రాత్రి 12గంటల సమయంలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. ముందుగా కల్యాణానికి కంకణాలను, స్వామిఅమ్మవార్ల అభరణాలను కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి పెండ్లి పీటలపై అధిష్ఠింపజేసి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు జరిగిన వివాహ వేడుకను తిలకించిన భక్తులు పరవశించిపోయారు. కల్యాణోత్సవంలో అమ్మవారి ఆలయ అర్చకులు, వేదపండితులు భ్రమరాంబాదేవి అమ్మవారి తరుపు బంధువులుగాను, స్వామివారి ఆలయ అర్చకులు, వేద పండితులు మల్లికార్జునస్వామివారి బంధువర్గంగా నిలిచారు.



పాతాళగంగలో దీపం వదులుతున్న యువతి

వైశిష్టంగా పాగాలంకరణ

బ్రహ్మోత్సవాల్లో పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. వివాహాల్లో పెండ్లి కుమారునికి తలపాగా చుట్టడం ఒక సంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైల ఆలయంలో పాగాలంకరణ పేరుతో అనవాయితీగా కొనసాగుతోంది. గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖమండపంపై ఉండే నవనందులను అనుసంధానం చేస్తూ పాగా అలంకరిస్తారు. హస్తినాపురానికి చెందిన పృథ్వీ సుబ్బారావు దిగంబరుడై పాగాను అలంకరించారు. ఇందుకు రాత్రి 10గంటలకు ఆలయంలోని విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. మొత్తం ఎనిమిది పాగాలు భక్తులు స్వామివారికి సమర్పించారు. పాగాలంకరణ జరుగుతున్నంతసేపు ఆలయంలో ఓంనమఃశివాయ అంటూ శివ నామస్మరణ మార్మోగింది.



భక్తులతో కిక్కిరిసిన శ్రీశైల ఆలయ ప్రాంగణం

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు బుధవారం భక్తులు పోటెత్తారు. ఆలయ అధికారులు ఆలయ పూజావేళల్లో మార్పులు చేశారు. వేకువజాము రెండు గంటల నుంచే దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉచిత దర్శన క్యూలైన్‌ భక్తుల క్యూ క్షేత్ర ప్రధాన వీధుల వద్దకు చేరింది. స్వామివారి దర్శనానికి సుమారు ఆరు గంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం ఉచితంగా తాగునీరు, అల్పాహారాన్ని అందించింది. కొందరు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి ఉదయం నుంచి రాత్రి వరకు ఎటువంటి ఆహారం తీసుకోకుండా శివనామస్మరణ చేశారు. శివమాలను స్వీకరించిన భక్తులు జ్యోతిర్ముడిని సమర్పించారు. పాగాలంకరణ తిలకించిన శివస్వాములు శివమాలధారణ విరమించారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ రోజు గురువారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8గంటలకు ఆలయ పుష్కరిణి వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహిస్తారు.



కోలాటం వేస్తున్న మహిళలు



భక్తులతో పోటెత్తిన పాతాళగంగ



రుద్రాక్షమాలలతో శివనామస్మరణ



కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉపాధిలో అక్రమాలకు తెర లేపారు!

- గతంలో ఇరవై మందికి ఒక మేటి
- ప్రస్తుతం 50 మందికి ఒక మేటి ఏర్పాటు దిశగా చర్యలు
- మేటీలను కుదిస్తే పనుల్లో అక్రమాలు సులువు
- టీడీపీ నాయకుల అనుచరులు మేటీలుగా అవతారం



కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్‌)

కోవెలకుంట్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను అధికార పార్టీ కార్యకర్తల జేబులు నింపేందుకు కూటమి సర్కార్‌ అక్రమాలకు తెరలేపారు. నిబంధనలను సైతం మార్చి వేసి పథకాన్ని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు పావులు కదిపారు. జిల్లాలో 489 మంది ఫీల్డ్‌ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాదాపు 200 మందికి పైగా ఫీల్డ్‌ అసిస్టెంట్లను తొలగించింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గతంలో పని చేస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్లు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులని కక్ష కట్టి వారిని విధుల నుంచి తప్పించారు. ఆయా మండలాల్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులను ఫీల్డ్‌ అసిస్టెంట్లుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల తమ వర్గానికి చెందిన వ్యక్తులకు ఫీల్డ్‌ అసిస్టెంట్‌ పోస్టులు కావాలని ఆ పార్టీలో వర్గపోరు జరుగుతుండటంతో ఇప్పటికి చాలా గ్రామాల్లో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ కారణంగా ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయి కూలీలకు పనులు లేకుండా పోయాయి. అలాగే ఉపాధి హామీ పథకంలో గతంలో ప్రతి 20 మంది కూలీలకు ఒక మేటిని ఉండేవారు. అందరిక కూలీల్లాగే మేటీ సైతం ఉపాధి పనులు చేయాల్సి వచ్చేది. మేటీతో పాటు ఆ గ్రూపులో ఉన్న 20 మంది కూలీలకు సమానంగా వేతనం అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేటీల వ్యవస్థను తమ చేతుల్లోకి తీసుకుంది. మేటీలను కుదిస్తే ఉపాధి పథకంలో అక్రమాలు సులువుగా చేయవచ్చని ఇరవై మందికి కాకుండా ప్రతి 50 మంది కూలీలకు ఒక మేటిని నియమించాలని కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. జిల్లాలో 2.55 లక్షల మంది కూలీలు పనులు చేస్తుండగా 5,100 మంది మేటీలను నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. కొత్తగా నియమించే మేటీలకు పనులు చేసే వేతనంతో పాటు మేటీగా ఉన్నందుకు అదనంగా డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టారు. దీంతో మేటీలుగా తమ అనుచరులను నియమించుకునేందుకు తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, వారి అనుచరులు మేటీలుగా అవతారమెత్తారు. కూటమి పార్టీకి చెందిన మేటీలు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు బినామీ మస్టర్లతో ఉపాధి పథకాన్ని పెద్ద ఎత్తున దోచుకుని కూలీల కడుపుకొట్టేందుకు కొందరి అధికారులతో కుమ్మకైనట్లు తెలుస్తోంది.

13 లక్షల పని దినాలు.. 37 రోజులు

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.50 లక్షల కుటుంబాల్లోని 2.55 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆయా మండలాల్లో 75 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ. 335 కోట్ల లేబర్‌ (కూలీల వేతనం, మెటీరియల్‌ కలిపి) బడ్జెట్‌ కేటాయించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాలోని ఆయా మండలాల్లో 61.99 లక్షల పనిదినాలు పూర్తి అయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 37 రోజులు మాత్రమే గడువు ఉంది. ఇంకా 13 లక్షల పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంది.

రాజకీయ కుట్రతో తొలగించారు



2019వ సంవత్సరం నుంచి ఉపాధి పథకం ఫీల్డ్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఐదేళ్లపాటు గ్రామంలోని కూలీలకు ఉపాధి పనులు కల్పించి వారికి ప్రతి రోజు సగటు వేతనం అందేలా తన వంతు కృషి చేశాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజకీయ కక్షతో ఫీల్డ్‌ అసిస్టెంట్‌గా తొలగించారు. టీడీపీ నాయకులకు అనుకూలంగా ఉన్న వ్యక్తులను నియమించుకున్నారు.

– రాఘవరెడ్డి, ఫీల్డ్‌ అసిస్టెంట్‌, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

ఉపాధి పనులను వేగవంతం చేయాలి



జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తి అయిన దృష్ట్యా గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలి. ఈ ఆర్థిక సంవత్సంలో ఇంకా 13 లక్షల పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంది. ఫీల్డ్‌ అసిస్టెంట్లు, మేటీల నియామకాల్లో రాజకీయాన్ని పక్కన పెట్టి కూలీలకు పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్‌, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కోవెలకుంట్ల

రావణవాహనంపై మహానందీశ్వరుడు



రావణవాహనంపై కొలువైన మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం రావణవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తు తరలి రావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి.

క్లుప్తంగా

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ పరిధిలోని కృష్ణగిరి క్వారీ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1.60 లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు.. తెలవారు జామున సిబ్బందితో కలిసి కృష్ణగిరి క్వారీ వద్ద సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటకకు చెందిన 40 బాక్స్‌ల 3840 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేసి నిందితుడు బండి లోకేష్‌ను అరెస్ట్ చేశారు. మద్యం సరఫరా చేస్తున్న రాజేంద్రపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చంద్రమోహన్, లక్ష్మి, హెడ్ కానిస్టేబుళ్లు జగన్నాథం, తిరుపాలు, పీరా, కానిస్టేబుళ్లు జగదీష్, సాయి, భూలక్ష్మి, సుజాత, నాగయ్య, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



ఘటనాస్థలంలో మృతి చెందిన శ్రీనాథ్

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన శ్రీనాథ్ (27) బుధవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్‌గా, క్లీనర్‌గా జీవనం సాగిస్తున్న శ్రీనాథ్ తన గ్రామం నుంచి కాల్వబుగ్గ వైపు మైనింగ్ ప్రాంతంలో డ్యూటీకి బైక్‌పై వెళ్తూ పెద్దమ్మ గుడి సమీపంలో ముందువెళ్తున్న జీపును ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తల్లి, సోదరి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

తప్పిపోయిన చిన్నారులు తలిదండ్రుల చెంతకు



ప్రదీప్‌ను తల్లికి అప్పగిస్తున్న కంట్రోల్ రూమ్

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య తప్పిపోయిన చిన్నారులను పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాకు చెందిన ధనంజనేయులు కుమార్తె ఎ.పరిమళ(12), కర్నూలు రచ్చుమర్రి గ్రామానికి చెందిన పార్వతి కుమారుడు ప్రదీప్ (3), దేవమాడకు చెందిన రియాజ్ కుమారుడు రజాక్ (8) తప్పిపోయినట్లు తెలుసుకున్న పోలీసులు కమాండ్ కంట్రోల్ రూంలోని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కొండచిలువ హల్‌చల్



కొండచిలువను ఫారెస్ట్‌లో వదిలిన దృశ్యం

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలోని భోగేశ్వరాలయం ప్రధాన కోనేరులో బుధవారం కొండచిలువ ప్రత్యక్షమైంది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు కోనేరులో స్నానాలు చేస్తుండగా కొండచిలువను చూసి భయాందోళనకు గురయ్యారు. ఆలయ సిబ్బంది, స్థానిక పోలీసులు కోనేరులోని భక్తులను బయటకు పంపి, ఫారెస్టు సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి విజయలక్ష్మి, ఫారెస్ట్ బీట్ అధికారి అబ్దుల్ కలాం, యాంటీ పోచింగ్ టీం కొండచిలువను పట్టుకుని గని ఫారెస్టులో వదలడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. కోనేరులో యథావిధిగా స్నానాలాచరించారు.



మల్లికార్జున, భ్రమరాంబికాదేవి ఉత్సవ విగ్రహాలు, నందికోలను ఊరేగిస్తున్న భక్తులు



జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



గడివేముల మండలంలో అన్నదానం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



జగన్నాథగట్టులో రూపాల సంగమేశ్వరస్వామికి పాలాభిషేకం



మద్దికెరలో పూజలందుకుంటున్న విరుపాక్షస్వామి వారు



భోగేశ్వరుడినికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

'పంచాక్షరి' మంత్రం.. భక్తి పారవశ్యం

ఓం నమఃశివాయ అంటూ భక్తులు శివనామ స్మరణ చేశారు. ప్రముఖ శైవలయాల్లో శివ భజనలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం మహా శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీశైలం, మహానంది, యాగంటి, కాల్వబుగ్గ, సంగమేశ్వరం, భోగేశ్వరం, జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరాలయాలను వేల మంది భక్తులు సందర్శించుకున్నారు. పండుగ సందర్భంగా ఉపవాసం ఉండి జాగారం చేశారు. పరమశివునికి పంచామృతాభిషేకాలు చేశారు. రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. లింగాష్టకాన్ని, శివ పంచాక్షరి మంత్రాన్ని జపించారు. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణోత్సవాలను, గ్రామోత్సవాలను వీక్షించారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షినెట్‌వర్క్



1. పెసలదిన్నె మోక్షలింగేశ్వర స్వామి
2. ఉత్తుత్తి (ఎండు ఖర్జురాలు)లతో అలంకరించిన శివలింగం
3. పార్వతి పరమేశ్వరుల ఉత్సవ మూర్తులు



పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



రామతీర్థంలో రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవాన్ని లాగుతున్న భక్తులు




కృష్ణానది జలాల్లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



మాయలూరు భీమలింగేశ్వర కల్యాణోత్సవంలో భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు



ఎమ్మిగనూరులోని మార్కండేయస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



యాగంటి కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

ముగిసిన పార్వేట ఉత్సవాలు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఉత్సవ మూర్తులకు ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలతో వీడ్కోలు పలికారు. జనవరి 16న అహోబిలం నుంచి పార్వేటకు బయలు దేరిన ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి భక్తుల నుంచి విశేష పూజలందుకున్నారు. చివరిగా రుద్రవరానికి చేరుకున్నారు. ఇక్కడ నాలుగు రోజుల పాటు పూజలందుకున్న స్వామి వారు చివరగా స్థానిక అటవీ కార్యాలయం ప్రాంగణంలోని తెరుపు మీదకు చేరుకున్నారు. అటవీ అధికారులు స్వామి వారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. చిన్నారులతో కోలాటం ఏర్పాటు చేసి ప్రజలకు వినోదం కల్పించారు. అనంతరం రాత్రి 10 గంటలకు స్వామి వారి పల్లకీని కాలినడకన దొర్పి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం దారిలో బోయిలు పల్లకీని మోసుకెళ్లారు. చివరి మజిలీగా హరినగరం సమీపంలో ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. అక్కడ సాయంత్రం 6 గంటల నుంచే చుట్టపక్కల గ్రామాల నుంచి చేరిన ప్రజల కోసం చెక్క భజన, కోలాటం, హరేక్రిష్ణ కీర్తనలు ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తుల పల్లకీ కొలువు దీర్చేందుకు ప్రత్యేక పందిరి వేశారు. స్వామి వారి పల్లకీ వెళ్లే దారిలో చెంచులు ముగ్గులతో అలంకరించారు.



రుద్రవరం అటవీ కార్యాలయంలో పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

'డెంగీ'తో చిన్నారి మృతి

పెద్దకడబూరు: డెంగీ జ్వరంతో నౌలేకల్లు గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి అక్షయ మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. గ్రామానికి చెందిన నాగేష్, శారద దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సిరివెన్నెల (12) అదే గ్రామంలో ఏడో తరగతి, రెండో కుమార్తె సింధుప్రియ(9) మూడో తరగతి చదువుతున్నారు. మూడో కుమార్తె అక్షయ(7) గత బుధవారం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం ఆదోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించారు. రెండు రోజులు అయినా జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ ఆదోనికి తీసుకెళ్లగా రక్త పరీక్ష అనంతరం 'డెంగీ' అని చెప్పారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం అక్షయ మృతి చెందారు. రెండో కుమార్తె సింధుప్రియకు రెండు రోజులుగా జ్వరం వస్తుండటంతో ఆదోనికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. పెద్ద కుమార్తె సిరివెన్నెల (12)కు జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పబ్లిక్ హెల్త్‌నర్స్ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, సిబ్బంది, ఈఓపీఆర్డీ జయరాముడు గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మంచినీరు కలుషితం కావడంతోనే డెంగీ జ్వరం వచ్చినట్లు పబ్లిక్ హెల్త్ నర్స్ సుశీల తెలిపారు. గ్రామంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తుడు నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్లో కుళాయిలకు బిరడాలు లేవని అక్షయ బాబాయి నాగరాజు తెలిపారు.





అక్షయ (ఫైల్), అక్షయ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఉద్యోగం పేరిట రూ.3 లక్షల టోకరా

ఆళ్లగడ్డ: ఉద్యోగం పేరుతో నిరుద్యోగుడికి రూ.3 లక్షల టోకరా పెట్టారు. శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన ఈశ్వరయ్యకు విజయవాడలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని గోస్పాడు మండలం ఒంటివెలగల గ్రామానికి చెందిన ఓబులేసు రూ.3 లక్షలు తీసుకున్నాడు. 8 ఏళ్లవుతున్నా ఉద్యోగం ఇప్పించకపోవడతోపాటు డబ్బు వెనక్కి ఇవ్వమని అడిగినందుకు చంపేస్తానని బెదిరించడంతో బాధితుడు ఈశ్వరయ్య డీఎస్పీ కార్యాయంలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహానందీశుడికి టీటీడీ పట్టువస్త్రాలు



ఈఓ శ్రీనివాసరెడ్డికి పట్టువస్త్రాలు అందిస్తున్న టీటీడీ ఏఈఓ మోహన్‌రాజు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. టీటీడీ ఏఈఓ మోహన్‌రాజు దంపతులు బుధవారం మహానందికి చేరుకుని ఈఓ శ్రీనివాస రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ, ముఖ్య అర్చకులు మణికంఠశర్మలకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవిక, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం శ్రీనివాసులు, మహానంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోనేరు వద్ద దొంగ చేతివాటం

మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన వృద్ధ భక్తుల నగదును ఓ దొంగ తెలివిగా ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా పామిడి మండలం గజరాంపల్లికి చెందిన నాగిరెడ్డి, మిత్రులు మహానందికి వచ్చారు. చిన్నకోనేరు వద్ద దుస్తులు, రూ.5,500 నగదు కవర్ పెట్టి స్నానాలు చేస్తుండగా ఓ యువకుడు అక్కడికి చేరుకుని తన టవల్‌ను అక్కడ పడేసి నగదు ఉన్న కవర్‌ను ఎత్తుకెళ్లాడు. అనంతరం బాధితుడు గుర్తించి కన్నీటి పర్యంతమయ్యారు. కాసేపటి తర్వాత అదే దొంగ అక్కడికి చేరుకుని తన టవల్ తీసుకుని పరుగులు తీశాడు.

మహానందీశా...నమోస్తుతే!

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో బుధవారం రాత్రి కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరుడు నందివాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చాడు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మలు వేదోక్తంగా పూజలు చేసిన అనంతరం స్వామి, అమ్మవారిని నందివాహనంపై కొలువు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు నందివాహనంపై కొలువైన మహానందీశ్వరస్వామి దంపతులను కనులారా తిలకించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కళాకారులు శివుడి వేషధారణలో రాక్షసులతో యుద్ధం, నోటిలో కిరోసిన్ పోసుకుని గాలిలో మంటలు పుట్టించడం లాంటి విన్యాసాలు భక్తులను కనువిందు చేశాయి.



నందివాహనంపై కొలువు తీరిన మహానందీశుడి దంపతులు



ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు



నందివాహనంపై మహానందీశ్వరుడికి గ్రామోత్సవం

ఐక్యతకు ప్రతీక రోజా దర్గా

- రేపటి నుంచి తుంగా తీరంలో ఆధ్యాత్మిక వేడుక
- దర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో 535వ ఉరుసు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం తుంగభద్రా నది తీరాన హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా రోజా దర్గా వెలుగొందుతోంది. ఈ దర్గా ముస్లిం ప్రజల దైవస్థానం అయినప్పటికీ హిందూ ప్రజలు భక్తులుగా ఉండటం విశేషం. ప్రతి గురు, శుక్రవారాల్లో భక్తులు ఈ దర్గాను సందర్శిస్తుంటారు. బాబా హజరత్ సయ్యద్ షా ఇస్ హక్ సనావుల్లా ఖాద్రి బాగ్దాద్ దేశీయుడు. 18 సంవత్సరాల వయస్సులో బర్నాల అనే గ్రామంలో 50 సంవత్సరాలు నిరాహార దీక్షలు చేశారని ప్రతీతి. అనంతరం ఆయన బాగ్దాద్ వెళ్లి వివాహం చేసుకొని సయ్యద్‌షా తాజ్ మహమ్మద్‌కు జన్మనిచ్చాడని మతాధిపతుల అభిప్రాయాలను బట్టి తెలుస్తోంది. తదనంతర మే సనావుల్లా ఖాద్రి కర్నూలుకు వచ్చి తుంగభద్రా నదీ తీరాన రోజా అనే గ్రామంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారని పీఠాధిపతి కుటుంబీకులు చెబుతుంటారు.


28 నుంచి ఉరుసు

రంజాన్ మాసం ప్రారంభానికి చిహ్నంగా నెలవంక కనిపించిన రోజున రోజా దర్గా ఉరుసు ప్రారంభమవుతుంది. ప్రస్తుత దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 28న రాత్రి గంధోత్సవంతో ప్రారంభమవుతాయి. మార్చి 1వ తేదీ (శనివారం) ఉరుసు, 2వ తేదీ (ఆదివారం)జియారత్ ముషరఫ్ కార్యక్రమం ఉంటుంది.ఉరుసు ఉత్సవాలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా ఆవరణలో చలువ పందిర్లను ఏర్పాటు చేశారు.



స్వామి వారి సమాధి

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఈ ఏడాది రోజా దర్గా 535వ ఉరుసు ఘనంగా నిర్వహించనున్నాం. వేడుక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉరుసులో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం. అన్నదానం నిర్వహిస్తాం. కులమతాలకు అతీతంగా భక్తులు ఉరుసులో పాల్గొని విజయవంతం చేయాలి.

– సయ్యద్‌షా దాదా బాషా ఖాద్రీ, రోజా దర్గా పీఠాధిపతి

మందుబాబులకు సరికొత్త శిక్ష

బనగానపల్లె రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తాగుతూ బనగానపల్లె, నందివర్గం, అవుకు పోలీసులకు పట్టుబడిన 47 మంది నిందితులకు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, బనగానపల్లె కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి షేక్ అబ్దుల్ రెహెమాన్ వినూత్న శిక్ష విధించినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. సోమవారం కోర్టులో నిందితులను హాజరుపరచగా వారికి శిక్ష, జరిమానా వేయకుండా మద్యపానంతో కలిగే అనర్థాలను ప్లకార్డులపై ప్రదర్శిస్తూ రెండు రోజులపాటు నిల్చోవాలని తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. జడ్జి ఆదేశాల మేరకు ప్లకార్డు ద్వారా బనగానపల్లెలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ కూడళ్లలో ముద్దాయిలను నిల్చోపెట్టి శిక్ష అమలు చేసినట్లు తెలిపారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముద్దాయిలు

మందు బాబులపై కేసు నమోదు

కర్నూలు (టౌన్): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు, బహిరంగంగా మద్యం తాగుతున్న ఏడుగురిపై మూడవ పట్టణ పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. వీరిని కర్నూలు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి రూ.3 వేల చొప్పున, బహిరంగంగా మద్యం తాగిన వారికి రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన మందుబాబులు